క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

'యాదన్న'ను గెలిపించుకుందాం

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మరోసారి గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశం సందర్భంగా గ్రామాల్లో మైనార్టీ నాయకులు అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్‌లలో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలో మాణిక్‌రెడ్డి, రవియాదవ్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గెలవాలంటే నాయకులు, కార్యకర్తలు కష్టపడి ప్రచారం నిర్వహించాలని, ప్రతి ఇంటికి అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. చేసిన సంక్షేమ పనులను చెబుతూ ఓటు అభ్యర్థించాలని వారు తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే యాదన్నను గెలిపిస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి యాదవ్, అజీజ్‌నగర్ బండ్లగూడ శ్రీశైలం, రాఘవేందర్, జె మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్, రజాక్, ఇర్ఫాన్, సలీమ్, మోయిన్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా జంగారెడ్డి



జంగారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి

మొయినాబాద్: కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీరాంనగర్‌కు చెందిన మంగళారం జంగారెడ్డిని నియమించారు. మంగళవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ నియామపత్రం అందజేశారు. అనంతరం చల్లా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. జంగారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. గ్రామాల్లో పార్టీ విస్తరణకు, అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, మహేందర్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, బిక్షపతి, వెంకటేష్, రియాజ్, మినాజుద్దీన్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

సినీ నటుడు బిత్తిరి సత్తి



పండుగ సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: మహనీయుల ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాని సినీ నటుడు బిత్తిరి సత్తి అన్నారు. చేవెళ్ల మండలంలోని దామరగిద్ద బస్‌స్టేజీ సమీపంలో మంగళవారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి వారి సమస్యల సాధనకు పోరాడాలని ఆయన పేర్కొన్నారు. పండుగల సాయన్న పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనలేని పలు పార్టీల నాయకులు ఆవిష్కరణ అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్, బీజేపీ మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం నాయకులతో కలిసి వచ్చి వేరువేరుగా నివాళులర్పించారు.

వ్యాధి నిరోధక టీకాలతో మేలు

పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: మూగజీవాలను వ్యాధుల బారినుంచి రక్షించుకోవాలంటే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా రైతులు టీకాలు వేయించాలని తెలిపారు. సక్రమంగా మూగజీవాలను చూసుకున్నప్పుడే రైతులకు మేలు జరుగుతుందని దీంతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందొచ్చని ఆమె పేర్కొన్నారు. ఎశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య
- మల్లారెడ్డిగూడ, ఎర్రోనికోటాల, పలుగుట్ట, కందవాడ, నారాయణదాస్‌గూడలో ప్రచారం



కందవాడ గ్రామంలో ప్రచారంలో ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



పలుగుట్ట గ్రామంలో ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తుడు

చేవెళ్ల: ప్రజా సేవకుడిగా నిరంతరం పనిచేస్తాను మరోసారి అవకాశం ఇవ్వండని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అభ్యర్థించాడు. చేవెళ్ల మండలంలోని మల్లారెడ్డిగూడ, ఎర్రోనికోటాల, పలుగుట్ట, కందవాడ, నారాయణదాస్‌గూడలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా తమ పార్టీ అభివృద్ధి చేసిందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయ మాటలు నమ్మొద్దని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేయలేదని, ఇప్పుడు అవకాశం ఇస్తే అభివృద్ధి పనులు చేస్తామని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. మల్లారెడ్డిగూడలో సర్పంచ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కందవాడలో ఎంపీటీసీ కావలి రవీందర్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశ్ ఆధ్వర్యంలో భారీగా మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అలయ్‌బలయ్, బతుకమ్మ ఆడి అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం. మాలతి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మార్కెట్‌కమిటీ చైర్మన్ ఎం. రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింలు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఎర్ర మల్లేశ్, సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ కావలి రవీందర్, ఉప సర్పంచ్ రాధిక, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు రమణారెడ్డి, క్రిష్ణారెడ్డి, వెంకటేశంగుప్తా, శివారెడ్డి, భీమయ్య, మల్లారెడ్డి, జహంగీర్, రవీందర్‌రెడ్డి, రామగౌడ్, తోట చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, ఎం. యాదగిరి, రాంచంద్రయ్య, ఎం. మాణిక్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్తుడు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుగుట్ట గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తుడు జంగయ్య నిలదీశాడు. ఏమి చేశావని వచ్చావు? నీకు ఓటు అడిగే హక్కు లేదంటూ ఎమ్మెల్యేను నిలదీశాడు. తనకు గ్రామంలో ఉన్న అసైన్డ్ భూమి విషయంలో అన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యేగా న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా తనకు న్యాయం చేయాలని కోరితే పట్టించుకోని వ్యక్తివి ఇప్పుడు వచ్చి నన్ను ఓటు వేయమని ఎందుకు అడుగుతున్నావని అందరి ముందే నిలదీశాడు. వెళ్లిపో ఇక్కడ నుంచి అంటూ అరిచాడు. ఒక సామాన్యుడి బాధను పట్టించుకోని నీకు ఓటు అడిగే హక్కు లేదని మండిపడ్డాడు. వెంటనే అక్కడున్న స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కలగ చేసుకొని వారించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎర్రోనికోటాల గ్రామంలో ఓ మహిళ సైతం ఏమి చేశారని ఓటు అడుగుతున్నారని ప్రశ్నించారు. కందవాడలో మహిళలు తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నట్లు, బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు. ఇంకా పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

దొరల పాలన వద్దు

- కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లిశంకర్
- రాహుల్‌గాంధీ పాదయాత్ర విజయవంతం చేయండి
- వైఎస్సార్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



మాట్లాడుతున్న వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: దొరల పాలన వద్దని ప్రజా తెలంగాణే ముఖ్యమని కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లిశంకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం షాద్‌నగర్‌కు రానున్న కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పాదయాత్రను విజయవంతం చేయాలని వీర్లపల్లిశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లిప్రతాప్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఈ పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న ఆయన నిరుపేదలకోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని గుర్తు చేశారు. మళ్లీ అలాంటి పాలన రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని వారు పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని, ఆత్మబలిదానాలపై స్పందించి, ఇక్కడి ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన తెలంగాణ దొరల చేతిలో బందీ అయిందని, దీన్ని విముక్తి చేయించాల్సిన అవసరం ప్రతి కార్యకర్తకు ఉందన్నారు. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తుందని, ప్రభుత్వ అరాచకాలను అరికట్టే వరకు విశ్రమించేది లేదని అన్నారు. ప్రజా వ్యతిరేక పాలనతో ప్రజలు అనేక కష్టాలను అనుభవిస్తున్నారని, కేసీఆర్ పాలన నుంచి విముక్తి చేయించాలని ప్రజలు కోరుకుంటునట్లు వారు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లిప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల రాకతో పార్టీ మరింత బలపడిందన్నారు. ఈ సమావేశంలో మహ్మద్‌అలీఖాన్‌బాబర్, చెందితిరుపతిరెడ్డి, కొంకళ్లచెన్నయ్య, జమృద్‌ఖాన్, గడ్డంశ్రీనివాస్‌యాదవ్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపిస్తే అండగా ఉంటానని పార్టీ అభ్యర్థి వీర్లపల్లిశంకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు 100మంది జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వీర్లపల్లిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ఇళ్లు ఇవ్వలేదన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లలోనే ఉంటున్నారన్నారు.

అప్రమత్తతే రక్ష!

- ఎంపీపీ ప్రియాంక
- తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంక

నందిగామ: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉంటేనే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కువగా ప్రజా ప్రతినిధులు ప్రచారంలో ఉండగా, కొంత మంది అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో ఈ సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తన నివేదికను చదివి వినిపిస్తుండగా రైతు రుణమాఫీ ఇంతవరకు ఎందుకు కాలేదని, ఫోన్‌లకు మెసేజీలు వచ్చినా కూడా మాఫీ కాలేదని ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్‌లు ప్రశ్నించారు. రూ.30,000ల నుంచి రూ.40వేలు సైతం కావడంలేదని వారు సభ దృష్టికి తెచ్చారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులు చాలామంది ఉన్నారని వ్యవసాయ శాఖ అధికారి గోపాల్‌ను ప్రశ్నించారు. ఈ విషయంలో ఏదైనా టెక్నికల్ సమస్య జరిగి ఉండోచ్చని ఆయన బదులిచ్చాడు. రూ.లక్ష వరకు తీసుకున్న రైతులకు మాఫీ అయ్యిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ పామ్ ఆయిల్ తోటలు పెంచుకునేందుకు ప్రభుత్వ రాయితీ ఉందని, దీన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీపీ ప్రియాంక మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ అధికారి తమ దృష్టికి తెచ్చిన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురియక పోవడంతో ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులకు ఎంతో మంది అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధుల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

హాజరు కానీ సర్పంచులు..

మండల సర్వసభ్యసమావేశానికి మండల పరిధిలోని 18 గ్రామాలకు చెందిన సర్పంచులు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్, కాట్న మాధవి, వెంకిరాల కలమ్మ, కోఆప్షన్ సభ్యుడు బెగ్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, సీడీపీఓ నాగమణి, నయాబ్ తహసీల్దారు లక్ష్మయ్య పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి

శంకర్‌పల్లి: ప్రతిఒక్కరూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా భారత్ డైనమిక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. అనంతరం శంకర్‌పల్లి ఎస్సీ బాలిక వసతి గృహంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లాభాయ్ పటేల్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ చంద్రమౌళి, ప్రొడక్షన్ మేనేజర్ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

శంకర్‌పల్లి: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంకర్‌పల్లి మూసీ వాగు పరిసరాల్లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్వర్తి గ్రామానికి చెందిన నేతి మహేశ్(35) గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పత్తేపురం మూసీ వాగు బ్రిడ్జి క్రిందకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

విద్యారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

చేవెళ్ల: ఆలూరు తక్షశిల హైస్కూల్ చైర్మన్ సయ్యద్ బాసిత్ పాషాకు విద్యారత్న జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా వీఎన్ గ్రీన్ ఫామ్ హౌస్‌లో కరడి వెంకటేశ్, ఎండీ నయూమ్ మంగళవారం సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో 18ఏళ్ల నుంచి పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చి విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మీనర్సింలు, ఎంపీటీసీ నరేందర్‌చారి, యాదమ్మ, మైనార్టీ నాయకులు అలీ, నర్సింలు, మునీర్‌ఖాన్, తాజోద్దీన్, ఎను, బాబా, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధా.. అంధకారమా?

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ కావాలా.. ప్రజలను మాయ మాటలతో అంధకారంలోకి నెట్టే కాంగ్రెస్, బీజేపీలు కావాలా తేల్చుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చౌడమ్మగుట్టతండా, అన్నారం, రామేశ్వరం, జోగమ్మగూడ, రాయికల్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై ఇంటింటి ప్రచారం చేపట్టారు. రామేశ్వరం రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంజయ్యయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీలు అధికార దాహంతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, వారి మాయమాటలు నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో రాంబల్‌నాయక్, బక్కన్నయాదవ్, సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆశన్నగౌడ్, లక్ష్మణ్‌నాయక్, రాములుగౌడ్, హన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డినరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

అభివృద్ధిని గాలికొదిలేశారు



మంచినీటి పైపులైన్‌లను పరిశీలిస్తున్న భీంభరత్

చేవెళ్ల: గ్రామాల్లో అభివృద్ధి, ప్రజా సమస్యలను గాలికొదిలేశారని కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండలంలోని తంగడపల్లి, మడికట్టు, సింగప్పగూడ, న్యాలట, రామన్నగూడ, పామెన, జాలగూడ, సాయిరెడ్డిగూడ, గుండాల, లక్ష్మీగూడ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజలు వారికి చూపించారు. అనంతరం వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. తంగడపల్లిలో మురుగునీటి కాలువనుంచే తాగునీటి పైపులు వేసుకొని వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు లేవు, డ్రైనేజీలు లేవు, ప్రజల పరిస్థితులు మారలేదు కాని బీఆర్‌ఎస్ నాయకులు, వారి కుటుంబాల, పరిస్థితులు మారాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సర్పంచ్ శైలజ పాల్గొన్నారు.

అయ్యప్పల ఆందోళన

మొయినాబాద్ రూరల్: అయ్యప్ప మాల ధరించిన విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అయ్యప్పస్వాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్కూల్ వద్ద ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి..చేవెళ్ల మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన వరుణ్ (4వ తరగతి), శంకర్‌పల్లి మండలం మేకన్‌గడ్డకు చెందిన సోనిక్ (2వ), వెంకటేశ్ (9వ) గండిపేట చౌరస్తాలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నారు. వీరు ముగ్గురూ మంగళవారం అయ్యప్ప మాల ధరించి పాఠశాలకు వెళ్లగా సిబ్బంది లోనికి రానీయకుండా బయటే కూర్చోబెట్టారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో తల్లిదండ్రులు, అయ్యప్పస్వాములు అక్కడకు చేరుకున్నారు. గురుస్వామి కుమ్మరి రాంచందర్ మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలను కించపర్చే విధంగా వ్యవహరించిన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ రంగా, ఎస్‌ఐ శిరీష సిబ్బందితో వెళ్లి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. అనంతరం సీఈఓ యశస్వి పాఠశాలకు చేరుకున్నారు. మాల ధరించిన విద్యార్థులను బయట ఆపేయడం తప్పన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా సిబ్బందికి తగిన సూచనలు చేస్తామని తెలిపారు. సీఐ రంగా విద్యార్థులను క్లాస్ రూమ్ వద్దకు తీసుకెళ్లారు. ఆందోళన చేసిన వారిలో అల్లం సుధాకర్‌రెడ్డి, ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మరు

చేవెళ్ల: గ్రామాల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మే స్థితిలో లేరని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం భీంభరత్ ఆధ్వర్యంలో ఎర్రోని కోటాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ శైలజ, మహిళా అధ్యక్షురాలు సమత, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, టేకుపల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

శంకర్‌పల్లి: ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి విఠల్ పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని మణి గార్డెన్‌లో బూత్ సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచకాలు ఎక్కువయ్యాయని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగుతుంటే, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విలువైన భూములతో పాటు దళితుల భూములను లాక్కొని అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటాడని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాలనలో దేశం ఎంతో సుభిక్షంగా ఉందని, ప్రతీ ఒక్కరికి ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు అందుతున్నాయన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేశ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహా, మాజీ సర్పంచ్ పంతం సంజీవ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎమ్మెల్యేది కుటుంబ పాలన

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యాదయ్య కుటుంబ పాలన సాగిస్తున్నారని పదవులు అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం ఆరోపించారు. మంగళవారం రాత్రి మొయినాబాద్ మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదయ్య ఎమ్మెల్యేగా ఉంటూ తన కొడుకు, కోడలు, భార్యకు ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు తెచ్చుకున్నారన్నారు. నియోజకవర్గంలో అవినీతి, అరాచక పాలన పోవాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. ఎనికేపల్లి మాజీ ఎంపీటీసీ ఆనంద్‌తో పాటు కొంత మంది యువకులు, వెంకటాపూర్, శ్రీరాంనగర్, అప్పారెడ్డిగూడ, చిన్నమంగళారం తదితర గ్రామాలకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, కౌన్సిల్ మెంబర్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పద్మనాభం, నర్సింహ్మారెడ్డి, ఓబీసీ మోర్చా చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ రత్నం, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పతనం ఖాయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

కొందుర్గు: ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ పతనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొందుర్గు మండలంలోని టేకులపల్లి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అభ్యర్థి శంకర్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, జమృత్‌ఖాన్, మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు వజ్రమ్మ, శ్రీనివాసుయాదవ్, పురుషోత్తం రెడ్డి, రమేశ్, అంజిరెడ్డి, పైల్వాన్, అమీద్, నర్సింహ రెడ్డి, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ర్యాలీ..

కొందుర్గు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అందిస్తామని తెలిపారు. నరేందర్, కావలి యాదయ్య, రాములు గౌడ్, రామకృష్ణ గౌడ్, మహేందర్, గోవర్దన్ గౌడ్, మల్లేశ్ గౌడ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని బీఆర్‌ఎస్

షాద్‌నగర్: లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు ప్రారంభించలేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టును నిర్మించి షాద్‌నగర్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

మొయినాబాద్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో మంగళవారం మైనార్టీ విభాగం మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకం అందని కుటుంబమే లేదన్నారు. ప్రతీ ఇంటికి ఏదోవిధంగా సంక్షేమ ఫలాలు అందాయన్నారు. మైనార్టీలకోసం రాష్ట్ర ప్రభుత్వం షాదీముబారక్, మైనార్టీ బంధుతోపాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి అనంతరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్‌ఎంపీపీ మమత, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, మైనార్టీ నేతలు షేక్ మహబూబ్, ఫైమిదాబేగం, పాషా, హైమద్, బిలాల్, మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మగౌడ్, సర్పంచ్‌లు శ్రీనివాస్, కుమార్, ఎంపీటీసీ మల్లేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు డప్పు రాజు, వెంకట్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, రవియాదవ్, సురేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, పరమేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మొయినాబాద్‌కు చెందిన యువకుడు సూరియాదవ్ మరికొంత మంది యువకులతో భారీ ర్యాలీతో ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే యాదయ్య వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన మైనార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మొయినాబాద్ మండల కేంద్రం నుంచి అంజనాదేవి గార్డెన్ వరకు ర్యాలీ తీశారు. దీంతో అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.